క్లుప్తంగా

అలరించిన భక్తి సంగీత కార్యక్రమం



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళావేదికపై ప్రొద్దుటూరుకు చెందిన ఎస్.నిరుపమ, బృందం వారిచే భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గణపతి నమో నమః, జయరామలింగేశ్వర, శివపంచాక్షరి, నాలోన శివుడు గలడు, కాశీవిశ్వనాథాష్టకం, తదితర శివాష్టకం, శివస్తోత్రం తదితర గీతాలు, అష్టకాలు మొదలైన వాటిని ఎస్.నిరుపమ, లక్ష్మీ అనుష, సాయికీర్తి, జ్యోతి తదితరులు ఆలపించారు.

కొరటాల ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

ఆత్మకూరు: సీపీఎం అగ్ర నాయకుల్లో ఒకరైన కొరటాల సత్యనారాయణ ఆశయాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు తీసుకెళ్లాలని పార్టీ సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని డాక్టర్ ఎ.ధనుంజయ మీటింగ్ హాల్‌లో కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నూర్‌అహ్మద్, సుధాకర్, వీరన్న, గణపతి, కిరణ్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరీ, గ్రామ వనదేవతల (వనుదేవమ్మ, గజ్జల పావమ్మ, రాములమ్మ, లక్ష్మమ్మ) ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఆలయ పురోహితులు సుబ్రమణ్యం శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవార్లకు అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, తదితర విశేష పూజలను జరిపించారు. ఆలయ ప్రాంగణంలో హోమం, అభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూమా కృష్ణమోహన్, అధ్యక్షుడు కటకం వెంకటేశ్వర్లు, కార్యదర్శి దొంతు కృష్ణమూర్తి, గుంతా సూర్యనారాయణ శెట్టి, కోశాధికారి కటకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చిరుతను బంధించండి

మహానంది: ఎవరికి ప్రాణాలకు హాని జరగక ముందే మహానంది ఆలయ పరిధిలో సంచరిస్తున్న చిరుతపులిని బంధించాలని ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, టీడీపీ నియోజకవర్గ నేత బన్నూరు రామలింగారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం మహానందిలోని పర్యావరణ కేంద్రంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దినేష్‌కుమార్ రెడ్డిని కలిసి విన్నవించారు.

11.8 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: ఎట్టకేలకు పక్షం రోజుల తర్వాత వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. వర్షంతో వాడుపట్టిన మొక్కజొన్న, మినుము పంటలు కోలుకునేందుకు ఉపయోగపడుతుంది.

రైతుల వివరాలు అందజేయాలి

వెలుగోడు: ప్రాథమిక వ్యవసాయపరపతి కేంద్రం పరిధిలోని రైతులు తమ పాస్ పుస్తకాల జిరాక్స్‌లు, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు వివరాలను ఈ నెల 5వ తేదీలోగా అందజేయాలని వెలుగోడు సొసైటీ సీఈఓ జంబులయ్య తెలిపారు. వాస్తవానికి గతనెల 20వ తేదీతోనే సమయం ముగిసినా మరో అవకాశం కల్పించారన్నారు. రైతులు తమ వివరాలను అందజేయకపోతే సొసైటీలో ఓటు హక్కును కోల్పోతారని హెచ్చరించారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ


మహానందిలో పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది ఆలయంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల దంపతులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పల్లకీలో కొలువు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు చేపట్టారు. ఆలయ ప్రాకారాల్లో ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు.

ఇంటి వద్దకే పింఛన్.. మాటలకే పరిమితం

- గ్రామ సచివాలయాలు, చెట్ల కింద పింఛన్ల పంపిణీ
- టీడీపీ నాయకుల హడావుడి.. అధికారుల ప్రేక్షక పాత్ర
- సర్వర్ సమస్యతో తలలు పట్టుకున్న సిబ్బంది



ఇస్కాలలో సచివాలయంలో పింఛన్ తీసుకొని బయటకు వస్తున్న సుజాత, గువ్వలకుంట్లలో ఓ అరుగు వద్ద ముఖగుర్తింపు ద్వారా పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పాములపాడు: ప్రభుత్వం చెప్పిన ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ విధానం మాటలకే పరిమితమైంది. సోమవారం ఎంతో ఆర్భాటంగా టీడీపీ నాయకులు పచ్చకండువాలతో పింఛన్‌దారులకు పెంచిన పింఛన్ నగదును అందిస్తూ ఫోటోలు దిగారు. దీంతో పింఛన్ పంపిణీ చేసే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించాల్సివచ్చింది. ఉదయం 8.30 గంటల నుంచి 11గంటల వరకు సర్వర్ మొరాయించడంతో సిబ్బంది తలలు పట్టుకున్నారు. మండలంలోని మిట్టకందాల గ్రామం ప్రత్యేకాధికారి ఎంపీడీఓ సరస్వతీ పరిశీలించిన సమయంలో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. ఆమె మరో గ్రామానికి వెళ్లగానే సచివాలయ సిబ్బంది గ్రామ సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే ఎస్సీ కాలనీలో ఓ అరుగు వద్ద చెట్టు కింద ఆ కాలనీవాసులకు పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో 90 శాతం పింఛన్ పింపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

సర్వర్ సమస్యతో పడిగాపులు

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో పింఛన్ పంపిణీని సచివాలయ సిబ్బంది సోమవారం ప్రారంభించారు. ఈ పింఛన్ పంపిణీ కార్యక్రమం ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటివద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి పంపిణీ చేయాల్సి ఉంది. అయితే సర్వర్ సమస్యతో 8 గంటలు దాటిన లబ్ధిదారులకు పింఛన్ నగదును అధికారులు అందించలేకపోయారు. ఇంటి వద్ద కాకుండా సర్వర్ ఎక్కడ పనిచేస్తే అక్కడికి పిలుపించుకొని సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు పింఛన్లను అందించారు. మండలంలో పింఛన్ పంపిణీ 92.69 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. మండలంలోని జీ.వీరాపురం గ్రామంలో ఎన్‌టీఆర్ పింఛన్ భరోసా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.

పింఛన్ల పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని 4వ సచివాలయం కింద పింఛన్‌దారులకు స్థానిక టీడీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. రెండు గంటల పాటు మాత్రమే పింఛన్ల పంపిణీ జరిగింది. రెండు గంటల తర్వాత సర్వర్ సమస్య రావడంతో నిలిచిపోయింది. శ్రీశైలం మొత్తం 881 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయంలో పనిచేస్తున్న 48 మంది వలంటీర్ల ద్వారా వారికి కేటాయించిన ప్రాంతాల్లో వేకువజాము నుంచే పింఛన్లను పంపిణీ కార్యక్రమం చేపట్టి సాయంత్రంలోగా ముగించేవారు. ప్రస్తుత ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేయాలని ఆదేశించింది. శ్రీశైలం సచివాలయంలో ఉన్న ఐదుగురు సిబ్బంది మాత్రమే ఉన్నారు. నీటిపారుదల శాఖలో పనిచేస్తున్న సిబ్బందిని డిప్యుటేషన్‌పై పింఛన్ల పంపిణీకి పంపారు. అయితే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు డిప్యుటేషన్‌పై వచ్చిన సిబ్బంది ప్రేక్షక పాత్ర వహించాల్సి వచ్చింది. పింఛన్లను స్థానిక టీడీపీ నాయకులు తమ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలకేంద్రమైన సున్నిపెంటలో సోమవారం సామాజిక పింఛన్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు పంపిణీ చేశారు. మూడు సచివాలయ పరిధిలో వీధివీధికి వెళ్లి నగదు పంపిణీ చేయడంతో సచివాలయ సిబ్బంది ప్రేక్షక పాత్ర వహించారు.

పింఛన్ల పంపిణీలో నాయకుల హడావుడి

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకుల హడావుడే అధికంగా కనిపించింది. మండలం వ్యాప్తంగా 5,075 పింఛన్లకు గాను రూ.3,49,77,000ల నగదు మంజూరైంది. ఈ మొత్తాన్ని పింఛన్‌దారులకు పంపిణీ చేయటానికి వివిధ శాఖలకు చెందిన 108మంది ఉద్యోగులను నియమించారు. ఉదయం ఆరుగంటలకు ప్రారంభించిన పింఛన్ల పంపిణీలో గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు ముందుండి పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఉదయం 11గంటల తర్వాత పింఛన్ల పంపిణీ సర్వర్ పనిచేయకపోవటంతో జూపాడుబంగ్లాతో పాటు అన్ని గ్రామాల్లోని సచివాలయాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. గంట తరువాత సర్వయర్ సక్రమంగా పనిచేయటంతో అధికారులు యథావిధిగా ఇంటింటికి వెళ్లి పంపిణీని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికారులు సతమతం కాగా జూపాడుబంగ్లాతో పాటు మరికొన్ని గ్రామాల్లో అధికారులు వలంటీర్లు, స్థానికుల సహాయం తీసుకున్నారు.

రాత్రయినా పూర్తి కాని పింఛన్ల పంపిణీ

మహానంది: ఉదయం పింఛన్ల పంపిణీ మొదలైనా రాత్రి వరకు పూర్తి కాలేదు. ఉదయం ఆరు నుంచి రెండు గంటల పాటు పంపిణీ సజావుగా సాగినా తర్వాత సర్వర్ మొరాయించడంతో మధ్యాహ్నం వరకు నిలిచిపోయింది. మధ్యాహ్నం 12.30 గంటల వరకు సర్వర్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. మహానంది మండలంలో మొత్తం 5,280 మంది లబ్ధిదారులు ఉండగా 5,032 మందికి పంపిణీ చేయగా 98శాతం పంపిణీ జరిగిందని ఈఓఆర్‌డీ శివనాగజ్యోతి తెలిపారు. బండిఆత్మకూరు మండలంలో 6,656 మందికి గాను 6,376 మందికి పంపిణీ చేసి 95.73శాతం సాధించినట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. పలు గ్రామాల్లో అధికారులను పక్కన పెట్టి కేవలం పార్టీ నాయకులే పింఛన్లు పంపిణీ చేసి ప్రచారం చేసుకున్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీలో 95 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ తెలిపారు. మొత్తం 4,326 మందికి గానూ 4,165 మందికి పింఛన్లను అందించినట్లు చెప్పారు. ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 4,927 మంది పింఛన్‌దారులకు గానూ 4,681 మందికి నగదును అందించినట్లు తెలిపారు. ఉదయం పట్టణంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి కొత్తపేట, ఏకలవ్యనగర్, నాగలూటి చెంచుగూండెంలో పింఛన్లను అందించారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్/మిడుతూరు/పగిడ్యాల: సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో, మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో, మిడుతూరులోని ఎస్సీ కాలనీలో పింఛన్లను ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల జిల్లా నాయకులు మాండ్ర శివానందరెడ్డి పంపిణీ చేశారు. మిడుతూరు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో తలముడిపి, కడుమూరు గ్రామ పంచాయతీలకు మంజూరైన ట్రాక్టర్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి పంచాయతీలకు అప్పగించారు. పగిడ్యాలలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కవిరాజు అధ్యక్షతన జరిగిన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే జయసూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పగిడ్యాల మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి, పడమర వనుములపాడు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పింఛన్‌దారులకు నగదు సొమ్మును అందజేశారు. కాగా, పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చోటామోటా గ్రామ నాయకులు, కార్యకర్తలు హడావుడి చేశారు. కేవలం అధికారులు పంపిణీ చేయాల్సి ఉండగా అన్నీ తామై పంపిణీ కార్యక్రమంలో హల్‌చల్ చేయడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ నాయకులు ముర్తుజావలి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.


ఇస్కాల గ్రామంలో అధికారి లేకుండా పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


శ్రీశైలంలో అధికారులను పక్కనపెట్టి పింఛన్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


నాగలూటి చెంచుగూడెంలో పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


నందికొట్కూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర

మిట్టకందాలలో తగ్గని అతిసారం

- కొత్తగా 6 కేసులు నమోదు
- తాగునీటి కలుషితం వల్లే వ్యాధి వ్యాప్తి
- గ్రామాన్ని సందర్శించిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్


కాలనీలో పరిసరాలు పరిశీలిస్తున్న ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో అతిసారా వ్యాధి తగ్గడం లేదు. 4 రోజులుగా కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రధానంగా గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడం, ప్రజలు కలుషిత నీరు తాగడం వల్లనే వ్యాధి ప్రబలుతున్నట్లు తెలుస్తోంది. గ్రామంలో ఇప్పటి వరకు 15 కేసులు ఉండగా సోమవారం కొత్తగా మరో 6 కేసులు నమోదయ్యాయి. వీరిలో ముగ్గురికి వైద్యశిబిరంలోనే చికిత్సలు నిర్వహించారు. మరో ముగ్గురిని ఆత్మకూరుకు తరలించారు.

పైపులైన్ లీకేజే కారణమా..?

గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రధాన పైపులైన్ లీక్ అయ్యింది. ఆ పైపులైన్ పైనే రోడ్డు పక్కగా కలుషిత నీటి ప్రవాహం నిత్యకృత్యం. ఇటీవల కురిసిన వర్షా లే కాకుండా కాలనీలోని ప్రజలు రోడ్డుపై పారబోసిన వృథా నీరు కూడా లీకేజైన పైపులైన్‌లోకి ప్రవహిస్తోంది. ఈ నీటిని తాగడం వల్లనే ప్రజలు అతిసారా వ్యాధిన పడుతున్నారని అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. గ్రామంలో మినరల్ వాటర్ సరఫరా చేయాలని చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు.


వైద్యశిబిరంలో చికిత్స పొందుతున్న అతిసారా వ్యాధి బాధితులు,

గ్రామంలో పర్యటించిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం

గ్రామంలోని ఎస్సీ కాలనీలో అతిసారా వ్యాధి ప్రబలుతుండటంతో జిల్లా కేంద్రం నుంచి ర్యాపిడ్ రెస్పాన్స్ టీం సభ్యులు అసోషియేట్ ప్రొఫెసర్ సుప్రాత్ (జనరల్ మెడిసిన్), అసిస్టెంట్ ప్రొఫెసర్లు మహేంద్రనాథ్ కుమార్, సచిన్ సుమంత్ (మైక్రో బయాలజీ), జాహ్నవి (కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్)లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. వ్యాధి బారిన పడిన వారి ఇళ్ల వద్దకు వెళ్లారు. ప్రజలతో మాట్లాడుతూ తాగునీరు కలుషితం వల్లే అతిసార ప్రబలిందని, అక్కడి నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, తాజా ఆహార పదార్థాలు మాత్రమే భుజించాలని, మల మూత్ర విసర్జన అనంతరం చేతులు శుభ్రం కడుక్కోవాలని సూచించారు. చిన్న పిల్లలు, పెద్ద వయస్సు వారు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఏ మాత్రం లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందాలన్నారు. వారి వెంట ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కాంతారావు నాయక్, డాక్టర్లు నాగలక్ష్మి, గులాబ్ షా, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

మహానంది: ఈ విద్యాసంవత్సరం పది పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని నంద్యాల డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. బండిఆత్మకూరు మండలం లింగాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఐఎఫ్‌పీ ప్యానల్స్ సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలెస్కో కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మోహన్‌రెడ్డి, యశోధ, సిబ్బంది పాల్గొన్నారు.

4న విద్యా సంస్థల బంద్

ఆత్మకూరు: ఈనెల 4న కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ-ఏఐఎస్ఏ-పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునేద్ బాషా, ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించిందన్నారు. దీనిని వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన కేజీ టూ పీజీ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. వైద్య విద్యా కోర్సులు చదవాలనుకునే 24 లక్షల మంది విద్యార్థులకు నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఆందోళనలకు గురయ్యారన్నారు. గతంలో ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలూ వచ్చాయన్నారు. ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంకు రావడం, 8 మందిది ఒకే కేంద్రం కావడం వంటి పరిణామాలెన్నో చోటు చేసుకున్నాయన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

డ్రైవర్లను జైలుకు పంపే చట్టాన్ని రద్దు చేయాలి

ఆత్మకూరు: డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేసే చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, పట్టణ ఉపాధ్యక్షులు రణధీర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై భారత న్యాయ సంహిత చట్టం రద్దు చేయాలని డ్రైవర్లు, ఆటో కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రమాద కేసుల్లో దుర్మార్గమైన బీఎన్ఎస్ చట్టంలో కఠినమైన నిబంధనలను అమలు చేయ డం ద్వారా భారత ప్రభుత్వం మొత్తం ప్రజలపై ముఖ్యంగా డ్రైవర్లపై దాడి చేసిందన్నారు. నిబంధనలు అమలైతే డ్రైవర్లందరూ జైళ్లల్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇస్మాయిల్, శివకుమార్, కరిముల్లా, దాదాబాషా, పుల్లయ్య, శీను పాల్గొన్నారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరు: అతిసార వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. సోమవారం అందరి సహకారంతో అతిసారను అరికడదాం అనే కార్యక్రమంలో భాగంగా బైర్లూటి పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో వైద్యాధికారి పవన్‌కుమార్ విద్యార్థులకు అతిసారి వ్యాధి లక్షణాలు, చికిత్స, నియంత్రణ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపర్‌వైజర్లు రమణమ్మ, ఆరోగ్య కార్యకర్త బేబీజ్యోతి, పాఠశాల హెచ్‌ఎం, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

వెలుగోడు: వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రేగడగూడురు జెడ్పీ హైస్కూల్‌లో వైద్యాధికారి జహీర్‌వలి స్టాప్ డయేరియా కేర్ క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహానంది: బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భావనారెడ్డి ఆధ్వర్యంలో బండిఆత్మకూరు కస్తూర్బా పాఠశాలలో వైద్య సిబ్బంది డయేరియా నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

నందికొట్కూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వి. ఏసురత్నం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో సీఐటీయూ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశం గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలపై పార్లమెంటులో చర్చలు జరపకుండా, వాటిని రద్దుచేసి ఏకపక్షంగా కార్మికులకు ద్రోహం చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందన్నారు. దీని వల్ల కోట్లాది మంది కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగన్న, మదార్ బీ, లక్ష్మి, వెంకటలక్ష్మి, శైలజ, మహేశ్వరమ్మ, రామసుబ్బమ్మ, విశ్వనాథ్, మునీశ్వరమ్మ పాల్గొన్నారు.

అధికారులందరూ హాజరుకావాలి

పాములపాడు: మండలంలోని అన్ని శాఖల అధికారులు మంగళవారం నిర్వహించనున్న సర్వసభ్య సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ సరస్వతీ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమావేశానికి హాజరుకానున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటల్లోపు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు రావాలని వివరించారు.

నూతన చట్టాలపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కొత్తపల్లి: విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కొత్తగా అమలులోకి వచ్చిన నేరచట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన చట్టాలను తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, సీఐలు ప్రకాష్ కుమార్, విజయభాస్కర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి


విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని సీహెచ్ బాలకృష్ణ సూచించారు. సోమవారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను వైద్యసిబ్బందితో కలిసి విద్యార్థులకు డయేరియాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతవరణంలో మార్పులు సంభవించడం, బోర్లు, చేతిపంపులలోని నీరు వార్పు చెందుతుందన్నారు. దీంతో డయేరియా సంక్రమించే అవకాశం ఉందని ప్రజలు, విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాంతులు, విరేచనాలు ఉంటే దగ్గర్లోని వైద్యసిబ్బందిని గాని, వైద్యులను గాని సంప్రదించాలని సూచించారు. నీటిని వేడిచేసి వడకట్టి తాగాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉసేనయ్య, ఏఎన్ఎం సరిత, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20 మంది విద్యార్థుల గుర్తింపు


నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక అవసరాల విద్యార్థిని చేర్పిస్తున్న ఐఈఆర్‌టీ రామకృష్ణయ్య

పగిడ్యాల: సర్వశిక్ష వారి ఆధ్వర్యంలో చేపట్టిన బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల 20 మంది విద్యార్థులను గుర్తించినట్లు ఐఈఆర్‌టీ రామకృష్ణయ్య సోమవారం తెలిపారు. 5 ఏళ్ల వయస్సు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో, 6 నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన దివ్యాంగులను ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చేర్పిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థి పి. రేషితా అనే అమ్మాయికి ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి చేతుల మీదుగా రోలేటర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ అరుణకుమారి తదితరులు ఉన్నారు.

భారతీయ చట్టాలలో మార్పులు


చట్టాల గురించి వివరిస్తున్న సీఐ నాగభూషణ్

ఆత్మకూరురూరల్: ఈనెల 1వ తేదీ నుంచి భారతీయ చట్టాలలో మార్పులు వచ్చాయని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ తెలిపారు. ఆత్మకూరు సర్కిల్ కార్యాలయ ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ శిక్షాస్మృతిని 1890 దశకంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించిందని, అప్పటి నుంచి శిక్షాస్మృతిలో మార్పులేదని చెప్పారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ ఆక్టులు భారతీయ న్యాయసంహిత, భారతీయ న్యాయ సురక్ష, భారతీయ సాక్ష్య చట్టాలుగా భారత ప్రభుత్వం మార్పులు చేసిందన్నారు. ఐపీసీగా ఉన్న చట్టాలన్నీ బీఎన్ఎస్‌గా మార్పు చెందాయని తెలిపారు. కొత్త చట్టాలపై పోలీస్ సిబ్బందికి అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎస్ఐలు నారాయణ రెడ్డి, హరిప్రసాద్ ఉన్నారు.